
# (ఆ)హారం

— శ్రీరంగ



తాసీల్దారు గోపాలరావుగారి ఇల్లు కళకళలాడుతున్నది. పెండ్లి సందడితో పెండ్లివారికి ఏర్పాట్లు చెయ్యటంలో సతమతమై పోతున్నాడు గోపాలరావు గారు.

తన యిల్లు చాలదని, పెండ్లివారికి వేరే యిల్లు విడిది కేర్పాటు చేసారు. అల్లుడి స్నేహితులు కోసం ప్రత్యేకంగా మునిసిపాలిటీ వారి బంగళాలో రెండు గదులు తీసుకున్నారు.

పెండ్లి ముహూర్తం 12-30 గంటలకు. పెండ్లి వారంతా యాభై మంది దాకా వున్నారు ఆడా, మగా కలిసి. అందులో ఎక్కువ శాతం ఆడవారే. వారి ఆర్భాటం చెప్పనలవిగాదు. వాళ్ల కట్టే చీరలు మాపరులకు జిగేలు మనిపిస్తున్నాయి.

ఇంతా చేస్తే పెండ్లికొడు కెవరో గాదు- తాసీల్దారు గారికి స్వయానా మేనల్లుడే. అయితే ఆయన అక్కగారు మూడేళ్ల క్రితమే చనిపోయింది. ఆమె కోరిక మీదే, తాసీల్దారుగారు పట్టుపట్టడంతో ఆయన బావగారు రాజారావుగారికి ఇంత తప్పలేదు. కొడుకు శ్రీనివాసరావుకు కేంద్ర ప్రభుత్వం వారి ఎయిర్ ఫోర్సులో ఏదో ఉద్యోగం వుంది. మేనరికమయినా గోపాలరావుగారు అల్లుడికి పెట్టుపోతలకేమీ తక్కువ చెయ్యలేదు. పది వేల రూపాయిలు కట్నం ఇచ్చాడు. పది తులాల బంగారంతో కంఠహారం చేయించాడు. మళ్లీ పెండ్లి కొడుకు దుస్తులకు, వాచీకి, సైకిలుకు మూడు వేల రూపాయిలు ముద్రాశుద్ధిగా యిచ్చాడు. అయినా శ్రీనివాసరావు తృప్తిపడినట్లు లేదు. ఉత్తపుణ్యానికి మేనకోడలును చేసుకున్నట్లు ఫోజు పెడ్తున్నాడు.

ఉదయం పెండ్లివారికి ఉప్మా, ఇడ్లీలు, కాఫీ, ఫలహారాలు మస్తుగా పంపారు. కాని అవి చాల లేదంటూ, అల్లుడు మునిసిపల్ బంగళా ఎదురున్న హోటలు నుంచి ప్రత్యేకంగా స్నేహితులకి పెసరట్లు తెప్పించాడు. స్నేహితులు ఒకరా, యిద్దరా? ఆ బిల్లు రెండు వందలదాకా అయింది. అయినా గోపాలరావు గారు బాధ పడలేదు.

పెండ్లి తతంగం ఎలాగో ముగిసింది. వెజిటబుల్ పలావు, సాంబారూ, అన్నమూ, పెరుగు పచ్చడీ చేయించాడు భోజనాలలోకి. లడ్డూలు వడ్డించారు. పాయసం చేసారు. అరటి ఆకుల్లో వడ్డించారు. అయినా పెండ్లివారిలో ఒకామె అననే అంది- " అప్పడాలు, వడియాలు వడ్డించలేదు. ఇదేమి విడ్డూరం?"అంటూ. గోపాలరావుకు తల తీసేసినట్లయింది.

"అవి రాత్రి వంటకాలలో తప్పక వుంటాయి- బంగాళా దుంపల కూరతో సహా" అంటూ గోపాలరావు గారు పెండ్లివారికి హామీ యిచ్చి, రాత్రి వంటకాలలో అవి వుండేటట్లు శ్రద్ధ తీసుకున్నారు.

రాత్రి విడిది నుంచి బాజాభజంత్రీలతో పెండ్లి వారిని భోజనానికి పిల్చారు. "పెట్రోమాక్సు లైట్లు లేవే?" అంటూ ఒకామె ఆశ్చర్యం వెలిబుచ్చింది. గోపాలరావుకు సర్ది చేప్పేటప్పటికే తలప్రాణంతోకకొచ్చింది.

"ఇది పెద్ద పట్టణం తల్లీ! వీథిలో మునిసిపాల్టీవారి ట్యూబ్ లైట్లు దేదీప్యంగా వెలుగుతుంటే ఇంకా పెట్రొమాక్సు లైట్లెందుకు తల్లీ!" అన్నారు గోపాలరావుగారు.

"ఏం వియ్యంకులండీ మీరు? పెట్రోమాక్సు లైట్లు ముందు పోతుంటే, వెనుక ఆడవాళ్ళు సింగారించుకుని నడుస్తుంటే అదో హోదా, కళన్నూ" అంది పెండ్లివారి తరపునామె.

"నిజమేనమ్మా! పల్లెటూరయితే, వీథి దీపాలుండవు. చీకటిగా వుంటుందని పెట్రోమాక్సు లైట్లు పెడతారు. పట్టణంలో ఇన్ని విద్యుత్ దీపాలుంటే అవెందుకమ్మా!" అన్నారు గోపాలరావుగారు..

ఆమె మూతి ముడుచుకొంది!

ఎలాగో రాత్రి భోజనాలు ముగించుకున్నారు పెండ్లి వారు. తెల్లవారుజామునే అంపకాలయినాయి. ఉదయం తీరికగా ఉప్మా తిని, కాఫీ త్రాగి పెండ్లివారు తమ కేర్పాటు చేసిన ప్రత్యేకమైన బస్సులో పెండ్లి కూతురితో సహా తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. కూతురు తన కాళ్లకు దండం పెట్టినప్పుడు, గోపాలరావుగారికి దుఃఖం ఆగలేదు.

అల్లుడు శ్రీనివాసరావుతో గోపాలరావు ఇలా అన్నాడు.

"అల్లుడూ! నాకు చేతనయినంతలో పెండ్లి జరిపించాను. ఎక్కడైనా తప్పులు జరిగితే మనసులో పెట్టు

కోమాక. ఎంతయినా మనమంతా చుట్టాలమే గదా. ఇంకా ఏమైనా ముట్టాల్సి వుంటే చెప్పు'' అని.

శ్రీనివాసరావు తండ్రి రాజారావు వంక చూసాడు.

''ఏం లేదు బావగారూ, ఏదో సరిపెట్టుకొన్నామనుకోండి. కాని మావాడు కుట్టించిన దుస్తులకు రెండు వందలయ్యాయి. వాచీకీ, సైకిలుకూ మీరిచ్చిన దాని మీద ఇంకా అయిదు వందలైనవి. తర్వాత వాడు కొత్త బూట్లు తీసుకొన్నాడు. అవి రెండు వందల రూపాయిలైనాయి... మీ యిష్టం'' అంటూ ముగించాడు రాజారావు. స్వయానా మేనల్లుడు? బూట్లు కొనుక్కున్నాట్ట? డబ్బు లియ్యమంటున్నాడు? ఇదెక్కడి మనస్తత్వం? ఏమీ ఆలోచించకుండా గోపాలరావుగారు ఇంకో వంద ఎక్కువ వేసి వెయ్యి రూపాయలు ముద్రేశుద్దిగా రాజారావు చేతిలో పెట్టారు. అంతటితో తృప్తిపడి (అప్పటికి) రాజారావు పెండ్లివారితో తిరుగు ప్రయాణం చేశాడు.

పెండ్లి సందడి అంతా ముగిసిన తర్వాత- కూతురు అత్తవారింటికి వెళ్ళిన తర్వాత లెక్కలు చూసుకొంటే గోపాలరావుగారి కండ్ల వెంబడి నీళ్లు తిరిగినై. స్వంత మేనల్లుడి కిచ్చి చేసినా పెండ్లికి కింత ఖర్చయితే, రెండవ అమ్మాయి పెండ్లి ఖర్చు మాటేమిటి? అయినా కూతురు సుఖమే తన సుఖమనుకొన్నాడు.

తర్వాత ఓ సంవత్సరానికి శ్రీనివాసరావు చెల్లెలి పెండ్లికి గోపాలరావు తన కుటుంబంతో తరలి వెళ్లాడు.

కప్పగంతుల
మల్లికార్జునరావు
సంచలనాత్మక సీరియల్
ది నీడిల్
త్వరలో ప్రారంభం

రాజారావు తన కూతురి పెండ్లి చేసిన తీరును చూసి ఆశ్చర్యపోయాడు గోపాలరావు. భోజనాలలో ఒక కూర, పప్పు, పచ్చడి, చారు, మజ్జిగ, ఏదో చిన్న స్వీటు. నో అప్పడాలు! పెండ్లి కొడుకు స్నేహితులకు వేరే ప్రత్యేకమైన యేర్పాట్లు యేమీ లేవు. వాళ్లూ విడిదిలో అందరితో పాటు ఓ మూల నక్కారు. మేళతాళాలు కూడా ఏదో వున్నాయంటే వున్నాయి.

అన్నిటికన్నా గోపాలరావును విషాదపరచిన విషయం కూతురు రేఖ చెప్పిన మాట. ''నాన్నగారూ! మీఅల్లుడుగారు మీరిచ్చిన కంఠహారాన్ని, ఇక్కడ నగల కొట్లో తూయించినారుట- పది తులాలు వుందో లేదో అని.''

''పోనీలే అమ్మా! దాని వలన వాళ్ల లేకితనమే కనపడింది గాని మనకేం నష్టం?'' నిట్టూరుస్తూ అన్నాడు గోపాలరావు.

''పోనీయండి నాన్నా? కాని ఆ హారం ఇప్పుడెక్కడుంది?'' అన్నది రేఖ.

''అదేమిటమ్మా! మీ యింట్లో ఇనప్పెట్టెలో ఎక్కడో దాచి వుంటారు?''

''లేదు నాన్నగారూ? అది మా ఆడబిడ్డ పెండ్లి కోసం బ్యాంకులో తాకట్టు పెట్టి డబ్బు తెచ్చుకున్నారు- నన్ను కూడా అడగకుండానే. ఇదెంత బాగుందో చూసారా?'' అంటూ రేఖ కన్నీరు పెట్టుకొంది.

గోపాలరావు బిత్తరపోయాడు. ఆడపిల్ల నగలని తాకట్టు పెట్టి కూతురి పెండ్లి జరిపిస్తున్న రాజారావు సంస్కృతి నేమనాలో అతనికి బోధపడలేదు. కూతురిని ఎలా ఓదార్చాలో ఆయన కర్థం కాలేదు.

''అల్లుడిని అడగమంటావా అమ్మా ఈ విషయం?'' అడిగాడు గోపాలరావు.

''ఎందుకు నాన్నా! అదొక రభస!'' అంది రేఖ.

కూతురి మాటలు కొప్పుకుని, ఆ విషయం తనకు తెలియనట్లే మనసులో వుంచుకొని, గోపాలరావు వియ్యంకుడి దగ్గర సెలవు తీసుకొని, తన వూరు తిరుగు ప్రయాణమైనాడు ఆవేదనతో. రాజారావు కంఠ హారం విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డాడు. ●


# నా జీవిత నేస్తం- అమర్ !

నేను ఎంతోకాలం మన్నికగా పనిచేసే అమర్ గ్యాస్ లైటర్లనే ఎల్లప్పుడూ కోరుకుంటాను.

వీటిలో జర్మన్ పిజో క్రిస్టల్స్ అమర్చినందున 50,000 సార్ల వరకు నిప్పు వెలిగించే వీలుంది. పైగా, రెండు సంవత్సరాల గ్యారంటీ మరియు జీవితాంతం ఉచిత సర్వీసును అందించేవి కేవలం అమర్ గ్యాస్ లైటర్లే!

మీరూ అమర్‌నే ఎంచుకోండి. ఇవి ఎనిమిది మోడల్స్‌లోనూ, నాలుగు అందమైన రంగుల్లోనూ లభిస్తున్నాయి.

జీవితాంతం మీకు తోడుగా ఉండే అమర్ లైటర్‌నే పొందండి.



ఆంధ్రప్రదేశ్‌కు పంపిణీదార్లు :

Mahavir Combines

కాంచన్ జంగా కాంప్లెక్సు, కింగ్ కోఠీ రోడ్, హైదరాబాద్-500 001.

amar®

ఎలక్ట్రానిక్ గ్యాస్ లైటర్లు.